కవితా కౌముది

# రాలేదని.. స్వాతి శ్రీపాద

రాలేదని ఎలా అనుకోను
గాలి గమకాలు తీసే కూనిరాగాల కుహూ రవాల్లో
మెత్తని నెమలీకల చీర చివర వినీ వినిపించని
 మువ్వల పరామర్శలా రవళిస్తున్న నీ స్వరం విన్నాక
సుతారంగా నేలను ఆనిన వెండి మట్టెల చప్పుడులా నీ ఊపిరి
నునువెచ్చగా స్పర్శ తరంగాలై గిలిగింతల మేల్కొలుపులు విన్నాక
రాలేదని ఎలా అనుకోను.

తెల్ల మేఘం వెండి పళ్ళెం చుట్టూ
బంగారం నీరద్దిన ఉదయకాంతి వెలుగుల్లో
నీ చూపులు ఒలికినట్టు విస్తరిస్తుంటే
ఇంటి చుట్టూ తెల్లగా పరచుకున్న మల్లెలు
అచ్చం నీ స్వచ్ఛమైన మనసులాగే
గుప్పు గుప్పున పరిమళాల వీవన పలకరిస్తుంటే
రాలేదని ఎలా అనుకోను.

ఎక్కడా ఆగితేనేం
వెనక్కు నడిచి చెయ్యందుకున్న కాలం
ఎక్కడికక్కడే భస్మమైపోయాక మరింక మాటల సడి లేని
మహాస్వప్నంలో వెన్నెల చిటారుకొమ్మన ఎదురెదురుగా
మౌనాన్ని పంచుకునే వెలుగు కళ్లకు
పిలవని నీ పెదవుల చివర ఒక చిన్న లహరి
జవాబుగా నెన్నుదుటన కొత్తరంగులు అద్దుకుంటూ నా ఊపిరి
రాలేదని ఎలా అనను. ★★★

# అనగనగా కాలం - - -

డా.మక్కెన శ్రీను

వైద్యుల హడావుడికో
ఏడు నెలలకే తొందరపడో
అమ్మ గర్భం నుండి వచ్చేశానట
మరో రెండు నెలల ముందే !

పరుగు పందెంలో బడిలో
ముందోడి కంటే నిముషం
వెనక పరిగెత్తానట
బహుమతి పోయిందట !

పరీక్ష రానీయనన్నారని
క్షణం కూడా తేడా రాకూడదని
పరిగెత్తిన కాలం లెక్కిస్తే
ఒలింపిక్ రికార్డు అన్నారట !

ఆ మధ్య రోడ్డెంట వెళుతుంటే
నాయకుడొస్తున్నాడంటూ
కారు కూతలతో హోరెత్తించి
కాలాన్ని లాగేసుకున్నారు!

రెండు ఏళ్ళు ముందో వెనకాలో
పదవీ విరమణ చెయ్యాలంటే
కాలం ముందు కెలుతుందో
వెనక్కెళ్లిందో అర్ధం కాలా!

వుద్యోగం లోనో సంసారంలోనో
సహచరులకో కుటుంబ సభ్యులకో
కాలం విలువ పదే పదే వల్లిస్తూ
కాల పహరణ చేశానంటారు !

ఇపుడేమో మధుమేహం సాకుతో
రక్త నాళం వుబ్బిందని
వైద్యులు కౌన్సిలింగ్ చేస్తూ
కాలవ్యవధి లేదంటున్నారు !

కాలంతో పరిగెత్తి
కాలపహరణ గావించి
కాలాన్ని లెక్కించక
కాలం చేసాడంటారా !



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎవ్వరో చిత్రకారుడీ పృథివికెల్ల
నద్భుతమ్మగు వర్ణమ్ములలదుచుండె
ప్రతి ఋతువునందు క్రొంగొత్త వర్ణములను
దివ్యమోహనమ్ముగనిట దిద్దుచుండె

నయనపర్వమ్ము మానసానందకరము
జీవనాధారమైనదీ చిత్రపటము
ఎవరి తరమిట్టి సౌందర్యసృష్టి చేయ
కలలనైననసాధ్యమౌ కార్యమిద్ది

చిరము విశ్వమున్నడిపించు సృష్టికర్త
యంతరంగమ్ము సతము రాగాబ్ధినిలయ
మా మహాప్రేమనీ యుర్వియందు నిలిపి
దివ్యసీమయో యనునట్లు తీర్చి దిద్దె

ఈ యనంత విశ్వములోననెన్నొ శుక్ర
గురుకుజాదిగ్రహమ్ములు కొల్లలున్న
ధరణి పైననే యీ ప్రేమ కురియనేల?
ఎన్ని యుగముల తపములీ పృథివి చేసె?

ప్రకృతి నిర్మాత ప్రేమానురాగకలన
చిగురు వేసిన పచ్చని సీమ యిద్ది
అరయనిచ్చోట సర్వమ్మునద్భుతమ్ము
భావజీవసౌందర్యనివాసమిద్ది

COMMENTS